క్లుప్తంగా

వైభవంగా గంధమహోత్సవం



కసుమూరి మస్తాన్‌వలి దర్గాలో గంధమహోత్సవం

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలో శుక్రవారం కసుమూరి మస్తాన్‌వలి దర్గా 8వ గంధమహోత్సవాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. తొలుత గంధాన్ని గ్రామంలో ఊరేగించి, అనంతరం సమాధులకు లేపనం చేశారు. ఆ గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఉభయకర్త ఉప్పుటూరు మస్తానయ్య, గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రీసర్వే ప్రక్రియ పరిశీలన



చేజర్లలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

చేజర్ల: మండలంలోని యనమదలలో జరుగుతున్న భూముల రీసర్వేను ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి శుక్రవారం పరిశీలించారు. భూమి నిర్ధారణ (గ్రౌండ్ ట్రూథింగ్) గురించి అడిగి తెలుసుకున్నారు. భూముల రీసర్వే రికార్డులను పరిశీలించారు. అనంతరం చేజర్ల సచివాలయంలో పలు రికార్డును పరిశీలించారు. సిబ్బందికి యూనిఫాం ధరించాలని, సమయానికి విధులకు హాజకావాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ,గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు నిర్వహణతో పాటు పట్టణంలోని పలు విద్యుత్ స్తంభాలు, తీగలు మార్పు చేసేందుకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రజలు సహకరించాలని కోరారు.

అల్లూరులో..

అల్లూరు: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ షేక్ మస్తాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


వాహనం ఢీకొని భిక్షగాడు మృతి



మృతి చెందిన గుర్తు తెలియని భిక్షగాడు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి పరిసర గ్రామాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్న ఓ వ్యక్తి గుర్తుతెలియని వాహన ఢీకొని తీవ్రంగా గాయపడి ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన డీసీపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ మేరకు ఎస్సై విశ్వనాథ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440627746 నంబరులో సంప్రదించాలని కోరారు.

విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

ఉదయగిరి: మండలంలోని వివిధ రకాల కుల వృత్తిదారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వకర్మ యోజనకు దరఖాస్తులు గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్లో దాఖలు చేసుకోవాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ అన్నారు. ఆమె శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించి 17 పంచాయతీల్లోని సర్పంచ్‌లు లాగిన్ చేసుకుని విశ్వకర్మ యోజనకు వచ్చిన దరఖాస్తులను వాలిడేషన్ చేయాలన్నారు. కులవృత్తులకు సంబంధించి ఎంపికైన వారికి వారం రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని కులవృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లికార్జున పాల్గొన్నారు.

దసరా సెలవుతో ఊర్లకు విద్యార్థులు

సంగం: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు దసరా పండగ సందర్భంగా సెలవులు ప్రకటించడంతో సంగం గురుకుల కళాశాల విద్యార్థినులు తమ ఇళ్లకు పయనమయ్యారు. శుక్రవారం సంగం గురుకుల కళాశాల వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి వారిని ఇంటికి తీసుకెళ్తూ కనిపించారు.

భారీ మెజార్టీల గెలుపే లక్ష్యం



కార్యక్రమానికి హాజరైన కావలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు



వీపీఆర్ కన్వెన్షన్‌లో కావలి నియోజకవర్గ సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలతో శుక్రవారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్,రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు అహర్నిశలు శ్రమించి భారీ మెజార్టీలతో గెలుపే లక్ష్యంగా అనుక్షణం కష్టపడాలని సూచించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం



ఉదయగిరి నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



సమీక్ష సమావేశానికి హాజరైన ఉదయగిరి నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు

ఉదయగిరి నియోజకవర్గంలో తిరిగి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్,రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చెప్పారు. శుక్రవారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలతో సమీక్ష సమావేశం జరిగింది. ఉదయగిరి నియోజవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, పార్టీ కార్యకర్తలకు రాబోయే ఎన్నికల్లో ఎలాంటి వ్యూహాలతో ముందుకెళ్లాలో దిశానిర్దేశం చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పార్టీ నేతల సమీక్షకు కార్ల భారీ ర్యాలీ



జెండా ఊపి కారు ర్యాలీ ప్రారంభిస్తున్న నాయకులు

అల్లూరు: ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన కావలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమావేశానికి మండలం నుంచి భారీగా కార్లతో ర్యాలీగా తరలివెళ్లారు. సుమారు 50 కార్లు, 100కు పైగా బైక్‌లతో దాదాపు 400 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, టౌన్, రూరల్ అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దైవాదీనం, ఉస్మాన్, కరుణాకర్, మేడా శ్రీనివాసుల రెడ్డి, సాధక్‌రెడ్డి, తాండ్ర మల్లి, పవన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, సుధా, శ్రీను జంషీర్, దాసరి మల్లి తదితరులు ఉన్నారు.

పాఠశాలల బస్సులపై చర్యలు తీసుకోండి



ఎంవీఐ వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ విద్యార్థి నాయకులు

ఆత్మకూరు: పలు ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల బస్సులు ప్రభుత్వం నిర్దేశించిన రోడ్డు భద్రత నిబంధనలను పాటించడంలేదని, వాటిని పరిశీలించి సరైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు కోరారు. శుక్రవారం రవాణాశాఖ ఎంవీఐ ఎం.రాములుకు ఆయన కార్యాలయం వద్ద ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆత్మకూరులోని పలు ప్రైవేట్ విద్యా సంస్థల వాహనాలు అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకుని ప్రయాణిస్తున్నాయని, దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రెండు రోజుల క్రితం ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిందని, త్రుటిలో ప్రమాదం తప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అశోక్‌రెడ్డి, ఆత్మకూరు కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, భరత్, కిరణ్, ఉదయ్, తదితరులు ఉన్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దారు జగదీష్‌బాబు

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ జగనన్న భూరక్ష, భూహక్కు పథకంలో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జగదీష్‌బాబు అన్నారు. మండలంలోని దేపూరులో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. సర్వే నంబర్ల వారీగా భూసర్వే చేయాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ పృథ్వీకుమార్, వీఆర్‌ఓలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పరిపూర్ణ ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష



బూదవాడలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ కిట్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు



అల్లూరు: ఆరోగ్య సురక్ష కిట్‌ను అందిస్తున్న ఎంపీడీఓ, నాయకులు

ప్రతి ఒక్కరికి పరిపూర్ణ ఆరోగ్యం చేకూరేలా, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పలువురు నేతలు, అధికారులు అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం బూదవాడ, అల్లూరు మండలం బీరంగుంట, కొండాపురం ఎర్రబల్లి, అనంతసారం మండలం సోమశిల, చేజర్ల మండలంలోని తూర్పుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు. అవసరమైన వారికి మందులు అందించడం, మెరుగైన వైద్యానికి ఆరోగ్యశ్రీ ద్వారా రిఫర్ చేశారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మెడికల్ కిట్లను అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



కొండాపురం: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు



సోమశిల: జగనన్న ఆరోగ్య సురక్ష మాట్లాడుతున్న ఎంపీడీఓ

15 నుంచి దసరా మహోత్సవాలు



మానసాదేవి అమ్మవారు

వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్లలో కొలువైన శ్రీమానసాదేవి (నాగలక్ష్మి) అమ్మ వారి దసరా మహోత్సవాలు ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 15న శైలపుత్రి, 16న బ్రహ్మచారిణి, 17న చంద్రఘంట, 18న కూష్మాండుర్గ, 19న స్కంద మాత, 20న కాత్యాయిని, 21న కాళరాత్రి, 22న మహాగౌరి, 23న సిద్ధిధాత్రి, 24న మానసాదేవి అమ్మవారిగా అలంకరణలు చేస్తారన్నారు. 24న తూర్పు రాజద్వార ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాల వినియోగం ఉంటుందన్నారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

చెరువుల అభివృద్ధి పనుల ప్రారంభం

ఉదయగిరి: ఉదయగిరి చిన్న, పెద్ద చెరువుల అభివృద్ధి పనులను శుక్రవారం ఆత్మకూరు జలవనరులశాఖ ఈఈ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి డీఈ చంద్రమౌళి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉదయగిరి చిన్న, పెద్ద చెరువుల అభివృద్ధికి రూ.18 లక్షల జైకా నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో జంగిల్ క్లియరెన్స్, తూము, అలుగు, కట్ట రివిట్‌మెంట్ మరమ్మతు పనులు చేయడం జరుగుతుందన్నారు. త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. వీరి వెంట ఈఈలు, సిబ్బంది ఉన్నారు.

సీఎల్‌సీ మహాసభను జయప్రదం చేయండి

ఆత్మకూరు: నెల్లూరు, రాయలసీమ జిల్లాల ప్రాంతీయ సదస్సు పౌరహక్కుల సంఘం (సీఎల్‌సీ) 50వ మహాసభను జయప్రదం చేయాలని సీఎల్‌సీ జిల్లా కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నెల్లూరులోని టౌన్ హాలులో శనివారం జరగనున్న సీఎల్‌సీ మహాసభలో రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఓ అబ్బయ్య రెడ్డి, కుంచెం సుబ్బారావు, బి సాంబ శివరావు తదితర పాల్గొంటారన్నారు. హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న సీఎల్‌సీ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

రైతులు సంయమనం పాటించాలి

సంగం: సోమశిల జలాశయంలో నీటి నిల్వ తక్కువగా ఉన్నందున రైతులు నార్లు వేసే సమయంలో సమన్వయంతో పాటు సంయమనం పాటించాలని నీటి పారుదలశాఖ పర్యవేక్షక ఇంజినీరు కృష్ణమోహన్ రైతులకు విజ్ఞప్తి చేశారు. సోమశిల జలాశయంలో 20 టీఎంసీల నీరు నిల్వ ఉందని, 12 టీఎంసీల నీరు తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తారని, మిగిలిన నీటితో సాగు నీటికి వినియోగిస్తారని అంచనా వేస్తున్నామని, అక్టోబర్ నెలాఖరులోనిర్వహించే సాగునీటి సలహా మండలి సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటారని, అప్పటి వరకు రైతులు నార్లు వేసేందుకు వేచి ఉండాలని కోరారు.

లేగదూడల పోషణతో రైతుల ఆదాయం అభివృద్ధి



మర్రిపాడులో లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): గ్రామీణ ప్రాంతాల్లోని పశుపోషకులు లేగదూడల పోషణతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా మర్రిపాడు పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. పలు గ్రామాల నుంచి రైతులు తీసుకువచ్చిన లేగదూడలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమం ద్వారా మేలుజాతి పశువుల ఉత్పత్తి కోసం రైతులు లేగదూడల పెంపకాన్ని చేపట్టాలని కోరారు. దీంతో తమ ఆదాయం అభివృద్ధితో పాటు జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవచ్చన్నారు. ప్రతి నియోజకవర్గానికి రెండు సంచార పశువైద్య వాహనాలు ఏర్పాటు చేసి పశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మేలుజాతి లేగదూడల ప్రదర్శనలో మొదటి బహుమతిగా ఎర్రగంగులు సుబ్బులు, రెండో బహుమతిగా ముప్పాళ్ల వెంకటేశ్వర్లు, మూడో బహుమతికి గంగినేని రమణయ్య లేగదూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీఏ గురు జయంతి, వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోండి

- పాలిటెక్నిక్ కళాశాలలో కాన్వొకేషన్



పాలిటెక్నిక్ కాన్వొకేషన్‌లో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

ఆత్మకూరు: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో చేరి మూడేళ్ల సాంకేతిక కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు ఆ విద్యను సద్వినియోగం అయ్యేలా భవిష్యత్‌ను నిర్మించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం కాన్వొకేషన్ నిర్వహించారు. మూడేళ్ల కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ ఉత్తీర్ణత అనంతరం ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఉన్నత చదువులు చదవాలనుకునేవారు ఇంజినీరింగ్ (బీటెక్) రెండో సంవత్సరంలో చేరేందుకు వెసులుబాటు ఉందన్నారు. పాలిటెక్నిక్‌తోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తమ చదువును ఏ విధంగానైనా సద్వినియోగం చేసుకునే అవకాశం వారికి ఉందన్నారు. విద్యార్థులకు ఉత్తీర్ణత సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అలి ఔలియా దర్గా 25వ గంధోత్సవం

- భక్తులతో కిక్కిరిసిన ఖాన్‌సాహెబ్‌పేట



ఖాన్‌సాహెబ్‌పేటలోని అలి ఔలియా దర్గా గంధోత్సవం సందడి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం ఖాన్‌సాహెబ్‌పేటలోని అలి ఔలియా దర్గా గంధోత్సవం కిక్కిరిసిన భక్తజన సందోహం మధ్య శుక్రవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమైంది. దర్గా పీఠాధిపతి బందా నవాజ్ బాబా (గోపిదేసి హజరత్తయ్య) నివాసం నుంచి విశేషంగా అలంకరించిన పీర్లు, ఖవ్వాలి పాటలు, బ్యాండ్ మేళాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హజరత్ సయ్యద్ ఖాజా రంతుల్లా నాయబ్‌రసూల్ దర్గా ప్రాంగణంలో గంధోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజామున గంధమహోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మోడల్ స్కూల్‌లో ముందస్తు దసరా వేడుకలు



దుష్ట సంహార ఘట్టం ప్రదర్శిస్తున్న అష్టలక్ష్ములు

కలిగిరి: కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు దసరా వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. వేడుకలకు విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి వారికి క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎస్‌ఏ–2 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అష్టలక్ష్మీ వేషధారణలో విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి

ఉదయగిరి: మండలంలోని బూత్‌లెవల్ అధికారులతో శుక్రవారం తహసీల్దార్ సానా శ్రీనివాసులు రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడతూ గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటు నమోదు ఫారం క్షుణ్ణంగా పరిశీలించుకుని తగిన ధ్రువపత్రాలు సరిచూసుకోవాలన్నారు. జాబితాలో చనిపోయిన ఓట్లు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. డబుల్ ఎంట్రీలపై దృష్టి సారించాలన్నారు. ఇంటింటికి తిరిగి పరిశీలించాలన్నారు. ప్రతి ఇంటికి డోర్ నంబరు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల నియమ నింబంధనలకు లోబడి ఎన్నికల సిబ్బంది పని చేయాలన్నారు. సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం పనికిరాదన్నారు. ఈ సమావేశంలో బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా తహలీల్ ఫాతేహా

- ముగిసిన గంధమహోత్సవం



తహలీల్ ఫాతేహా నిర్వహిస్తున్న దృశ్యం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో జరుగుతున్న గంధ మహోత్సవం ముగిసింది. చివరి రోజు శుక్రవారం తహలీల్ ఫాతేహాను వైభవంగా నిర్వహించారు. ఉదయం దర్గా ఈఓ హుస్సేన్ ఆధ్వర్యంలో తాత్కాలిక పీఠాధిపతి ఫయాజ్ అహ్మద్ ఇంటి వద్ద నుంచి ప్రధాన దర్గా వద్దకు చేరుకున్నారు. అక్కడ భక్తుల సమక్షంలో చదివింపుల కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఖురాన్‌ఖానీ చేపట్టారు. తహలీల్ ఫాతేహా జరుగుతున్న సమయంలో ఫకీర్లు ప్రత్యేక ఖవ్వాలి పాటలు పాడి పలు విన్యాసాలు చేశారు. అనంతరం దర్గాలోని నాయబ్ రసూల్, దొరసానమ్మ సమాధులకు గంధాన్ని లేపనం చేసి భక్తులకు పంచి పెట్టారు. సీఐ రవి నాయక్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

భారీగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

కావలి: సేవియర్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి శుక్రవారం ఒక్క రోజే 580 యూనిట్లకు పైగా సేకరణ చేసి కావలి చరిత్రలో సరికొత్త రికార్డు నెలకొల్పారు. గతంలో 2022 డిసెంబర్ 9న ఒక్క రోజులో అత్యధికంగా రికార్డు స్థాయిలో 370 యూనిట్లు సేకరించిన రికార్డును శుక్రవారం తిరగ రాశారు. కావలికి చెందిన సేవియర్స్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్, విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్‌ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. 580 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రవి నర్సింగ్ హోమ్ డాక్టర్ రవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల, కావలి, అభయం స్వచ్ఛంద సేవా సంస్థ, ఐఆర్‌సీఎస్ యోగా కేంద్రం, రోటరీ క్లబ్, ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్, జనవిజ్ఞాన వేదిక సహకారం అందించారు. ప్రముఖ వైద్యులు లైఫ్ కేర్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ నళిని పద్మ డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్, నెల్లూరు జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ సుధీర్‌నాయుడు, రవిప్రకాష్, గంధం ప్రసన్నాంజనేయులు రక్తదాతలను, నిర్వాహకులను అభినందించారు.